క్లుప్తంగా

భూ రీ-సర్వేతో రైతులకు మేలు



సిరసపల్లిలో రీ-సర్వే పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న భూ రీ-సర్వేతో రైతులకు మేలు జరుగుతుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో శుక్రవారం రీ-సర్వే పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములను రీ-సర్వే చేసే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేడ జగ్గప్పారావు, వీఆర్వో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



నీలిగుంటలో పొక్లెయిన్‌తో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ వరహాలబాబు

కోటవురట్ల: పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. నీలిగుంట, కె.వెంకటాపురం గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. నీలిగుంటలో శ్మశాన వాటిక వద్ద చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు ఆధ్వర్యంలో పనులు నిర్వహించారు. పొక్లెయిన్‌తో చెత్తను తొలగించి, చదును చేశారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్ పరిసరాలు, వీధుల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్‌జల్లారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా రాము



ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

మునగపాక: ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా ఎం.వై. రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వి.రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దుర్గా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల పరిశీలకునిగా అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సన్యాసినాయుడు వ్యవహరించారు. యూనియన్ సీనియర్ నాయకులు పెంటకోట సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు.

నేడు తిమ్మరాజుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మన్మథరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యలమంచిలి మండలంలో..

యలమంచిలి: మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,యలమంచిలి పట్టణంలో తులసీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీవో అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు తెలిపారు. ఆరోగ్య సురక్ష టోకెన్లు తీసుకువెళ్లి శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు కోరారు.

నేడు ' ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి'

యలమంచిలి: స్థానిక గుర్రప్ప కల్యాణ మండపంలో 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' కార్యాక్రమంపై శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యకర్తలు సమావేశం జరుగుతుందని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర తెలిపారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కన్నబాబురాజు పాల్గొంటారని, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు

యలమంచిలి: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని ఏటికొప్పాక గ్రామ సచివాలయం-2 లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, బొద్దపు యర్రయ్యదొర,కరణం రవి,ప్రతాప్‌బాబు,తహసీల్దార్ రాణి అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. విభాగాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిబిరాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి ప్రారంభించారు. ఈ క్యాక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డి బాలాజీ,షేక్ ఇస్మాయిల్,జగదీష్, మళ్ల ఈశ్వరరావు,దొడ్డి కోటేశ్వరరావు,బుద్ద రమేష్, మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు,ఎంపీడీవో మన్మథరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి తదితరులు పాల్గొన్నారు.



ఏటికొప్పాకలో పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు



హరిపురంలో చికిత్స చేస్తున్న వైద్యుడు

రాంబిల్లి: ప్రజారోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. హరిపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ), ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, సర్పంచ్ ధూళి దేవుడమ్మ బుజ్జి, సచివాలయ మండల కన్వీనర్ కొవిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తోటాడలో వైద్య శిబిరానికి హాజరైన జనం



కొండకర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఆస్పత్రులకు వెళ్లలేని వృద్ధులు, పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరంగా మారిందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు తెలిపారు. అచ్యుతాపురం మండలం కొండకర్లలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ఎంత ఖర్చు చేసేందుకైనా ప్రభుత్వం వెనుకాడడం లేదన్నారు. 105 రకాల మందులను సచివాలయాలకు పంపినట్టు చెప్పారు.

అంతకు ముందు శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ,నర్మాల కుమార్,దేశంశెట్టి శంకర్‌రావు,కోన బుజ్జి, అంజిరెడ్డి,కే.శివ,బోడపల్లి వెంకట్,వైద్యులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే ధ్యేయం



పాములవాక వైద్య శిబిరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



పాములవాక వైద్య శిబిరంలో రోగికి ఈసీజీ తీస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

కోటవురట్ల: ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు సరికొత్త చరిత్రను సృష్టిస్తున్నాయని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పాములవాక ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శిబిరంలోని ప్రతి విభాగానికి నేరుగా వెళ్లి అక్కడ అందిస్తున్న వైద్యసేవల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏడు రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని, చికిత్స పొందేందుకు ఎవరూ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే సీఎం జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ శిబిరాల్లో స్థానిక వైద్యులే కాకుండా కేజీహెచ్, అపోలో వంటి పెద్ద ఆస్పత్రుల నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చి సేవలు అందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, ఆరోగ్యమిత్ర కుసుమరాణి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని పి.ఎల్. పురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో సుమారు 450 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. మండల అభివృద్ధి అధికారి ఎ.ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. వైద్యాధికారులు విద్యాసాగర్, ఇషాక్ మహమ్మద్, విజయ, కనకలక్ష్మి,ఎస్.ఎస్.వి. కృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడాల దివాణం, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, కార్యదర్శి బి.ఎ.బి.ఎల్. మూర్తి, బొలిశెట్టి శ్రీను, కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పీఎల్ పురంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

ఎస్.రాయవరం: ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. స్థానిక సచివాలయం-2లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, మాట్లాడారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 542 మందికి సేవలందించారు. వైద్య నిపుణులు ధర్మతేజ, రాజేశ్వరి, ఎ.జయలక్ష్మి, వెంకట్రావు తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, పీఏస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాపాలు చేయడంతో చంద్రబాబుకు తప్పని జైలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



రాంబిల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

మునగపాక: చంద్రబాబు నాయుడు పాపాలు చేయడంతో జైలు జీవితం అనుభవిస్తున్నాడని, ఈ పాపంలో జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్‌కు కూడా వాటా లేకపోలేదని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. ఇటువంటి నాయకులు జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు కుట్రలు,కుతంత్రాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎంతమంది కుట్రలు,కుతంత్రాలు చేసినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజలకు జరిగిన మంచిని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. వలంటీర్లు,కన్వీనర్లు,గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, నేటి ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను తెలియజేయాలని సూచించారు. రానున్న ఎన్నికలను సవాల్‌గా తీసుకుని వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి వచ్చేలా పాటుపడాలన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుని, ప్రజలకు మరిన్ని సేవలందించాలన్నారు. నేటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్,పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మొల్లేటి వినోద్,బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్‌తో తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. రాంబిల్లిలో శుక్రవారం 'ఎందుకు ఆంధ్రాకి జగన్ కావాలి' కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న పాలనలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తున్నారని చెప్పారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. చేసిన పనులు ఇంటింటికీ వెళ్లి వివరించి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఈ కార్యక్రమం విధి విధానాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు డి.ఎస్.ఎస్. రాజు(బుజ్జి), మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై గ్రామ సభలో వినతులు



సర్పంచ్ ఉషశ్రీ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పాయకరావుపేట: పాయకరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ గారా ఉష శ్రీ ప్రసాద్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో గల రాజుగారిబీడులో తలుపులమ్మ తల్లి చెట్టు సమీపంలో మళ్లీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు సభలో కోరారు. తాండవ వంతెనపై గల బ్రిడ్జ్ ఫుట్‌పాత్ చేపలు, పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నందున ఇబ్బందులు ఏర్పడుతున్నాయని మాజీ ఎంపీటీసీ ధనిశెట్టి బుజ్జి సభ దృష్టికి తీసుకొచ్చారు. రాజీవ్‌నగర్ కాలనీ, దుర్గాకాలనీ, రెల్లి కాలనీ ప్రాంతాల్లో నీటి సరఫరాకు ట్యాంకులు నిర్మించాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సర్పంచ్ కోరారు. ఈ సమావేశంలో ఉప గ్రామ సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్, ఈకేవైసీ నమోదు



ఈకేవైసీ చేయిస్తున్న సిబ్బంది

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. దిమిలి, కట్టుబోలు, మురకాడ గ్రామాల్లో ఈ క్రాప్, ఈకేవైసీ కార్యకలాపాలను ఏవో సుమంత పరిశీలించారు. ఆర్‌బీకే సిబ్బందికి సహకరించి రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో సూచించారు.

వాకర్స్ క్లబ్ లాంగ్ వాక్ నేడు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు లాంగ్ వాకింగ్ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూచౌక్ నుంచి పెరుగు బజార్ జంక్షన్, రింగ్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రహదారి, నాయుళ్లవీధి, రామచంద్ర థియేటర్ మీదుగా జార్జిక్లబ్‌కు లాంగ్ వాకింగ్ చేరుకుంటుందన్నారు. అనంతరం క్లబ్‌లో సమావేశం నిర్వహించి, 2024 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. క్లబ్ సభ్యులు అందరూ హాజరుకావాల్సిందిగా కోరారు.

దోచుకునేందుకే ఆ రెండు పార్టీలు కలుస్తున్నాయి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: రాష్ట్రంలో ప్రజాధనాన్ని దోచుకోవడం కోసమే వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడానికి జనసేన, టీడీపీలు సిద్ధమవుతున్నాయని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నక్కపల్లిలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను వివరించడంతో పాటు, అవి అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెండు రోజుల పాటు పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నట్టు చెప్పారు. కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లే సంస్కృతి, విధానం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నాం కాబట్టే ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్తున్నామన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే ఈ పథకాలన్ని రద్దు చేస్తారని తెలిపారు. అమరావతి కుంభకోణం, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, ఇన్నర్ రింగ్‌రోడ్డు కుంభకోణాలకు పాల్పడి చంద్రబాబు జైలు వెళ్లారని చెప్పారు. చంద్రబాబు కుంభకోణాలు ఆయన అధికారంలో ఉన్నప్పుడే వెలుగులోకి వచ్చాయని, అయితే అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పించుకున్నారన్నారని తెలిపారు. చంద్రబాబు అరెస్టుతో జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించి రాష్ట్రాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సింహాచలం బోర్డు మెంబర్ శేషారత్నం, వార్డు సభ్యులు బంగార్రాజు, అల్లాడ కొండ, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తాతబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందు, బాబ్జి, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

భగీరథమ్మ దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లిలో వెలసిన భగీరథమ్మ దసరా మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కన్నబాబు రాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ధ వెంకట రామ సత్యనారాయణ,కార్యదర్శి అప్పారావు,సూరిసెట్టి గాంధీ,బుద్ధ బలరామనాయుడు, నాగేశ్వరరావు,సూరి అప్పారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

మొక్కుబడిగా 'చంద్రబాబుకు తోడు' నిరసన దీక్షలు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ నేతలు చేపట్టిన నిరసన దీక్షలు మొక్కుబడిగా సాగుతున్నాయి. యలమంచిలి టీడీపీ పార్టీ కార్యాలయం వద్ద గల దీక్షా శిబిరం తెలుగు తమ్ముళ్లు లేక శుక్రవారం వెలవెలబోయింది. నాయకులు ఉదయం మీడియాకు ఫోజులిచ్చి వెళ్లిపోయారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత శిబిరం వద్ద చాలా కుర్చీలు ఖాళీగా కనిపించాయి.



టీడీపీ శిబిరం వద్ద ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్య సేవలపై వినతి

అనకాపల్లిటౌన్: వైద్యాలయం రోగుల పాలిట దేవాలయం కావాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులపట్ల దురుసుగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఎమర్జెన్సీ కేసులకు తక్షణమే అత్యవసర సేవలు అందించాలన్నారు. గర్భిణుల వార్డుల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ మిషన్ల ఏర్పాటు తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

యలమంచిలి: వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలో పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం రాత్రి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు మొగలపల్లి గణేష్,చంద్రగిరి నాని తెలిపారు.ఫ్లడ్ లైట్ల వెలుతురుతో ఈ పోటీల్లో ఉత్సాహంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ పోటీలు చూడడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

తూటికాడ కషాయంతో సుడి దోమ నివారణ

అనకాపల్లి రూరల్: తూటికాడ కషాయంతో వరి పంటలో సుడి దోమను సులభంగా నివారించవచ్చని ప్రకృతి వ్యసాయం మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు అన్నారు. మండలంలోని బవులువాడలో శుక్రవారం సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగును రైతులు చేపడుతున్నారు.

ప్రస్తుతం వరి పంటను సుడి దోమ ఆశించడంతో దాని నివారణ కోసం రైతులు ఎలాంటి పద్ధతులు పాటించాలో వివరించారు. తూటికాడ కషాయం తయారీ విధానాన్ని, పంటపై ఎలా పిచికారీ చేయాలో రైతులకు ప్రయోగాత్మకంగా చూపారు. తూటికాడ, ఆవు మూత్రంతో కషాయాన్ని తయారు చేయడానికి రూ.2 వేలు ఖర్చవుతుందని, ఈ విధంగా పండించిన పంటలకు సమీప నగరాల్లో మంచి గిరాకీ ఉంటుందని పేర్కొన్నారు. సేంద్రీయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులకు తమ శాఖ ధ్రువీకరణ చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడైనా ఈ ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందన్నారు.

స్థానిక మార్కెటింగ్ ప్రతినిధి ఎస్ఎఫ్ఏ వర్మ, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి సత్యారావు, వెంకటరమణ, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

యువకుల చేతిలో కొండచిలువ హతం

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో కొండ చిలువ హడలెత్తించింది. మజీద్ పక్కనే ఉన్న పొలాలలోంచి కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో చూసిన స్థానికులు భీతిల్లారు. నవజవాన్ యూత్ సభ్యులు అక్కడకు చేరుకుని కర్రలతో కొండ చిలువను హతమార్చారు. ఈ కొండ చిలువ సుమారు 10 అడుగుల పొడవున్నట్టు తెలిపారు.



హతమైన కొండచిలువ

కేవీకేను సందర్శించిన నాబార్డు ఏజీఎం

రాంబిల్లి: హరిపురం బీసీటీ కేవీకేను శుక్రవారం నాబార్డు ఏజీఎం బీఆర్ సమంత్‌కుమార్ సందర్శించారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే వివిధ రకాల పరికరాలు, సాంకేతికతను ఆయన పరిశీలించారు. గ్యాగస్ కోళ్ల యూనిట్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, నాగేంద్రప్రసాద్, శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.



కోళ్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న సమంత్‌కుమార్